అతను మనోహరంగా చిర్నవ్వులు వెదజల్లుతూ, ఆఫీసులో అడుగుపెట్టాడు. తలంటుపోసుకున్నాడేమో వుంగరాల జుత్తు, గాలికి స్వేచ్ఛగా కదులుతూ, అందంగా వూగుతోంది. అతను, చేతిలో బొత్తిగా పెట్టుకున్న కవర్లు, వాటికి నాలుగు పక్కలా పసుపు మరకలతో సరాసరి ఎకౌంటెంట్ దగ్గరకి వచ్చాడు. ఎకౌంటెంట్‌తోపాటు, ఆ హాలులో కూర్చున్న మిగిలిన అసిస్టెంట్ మేనేజరు, గుమస్తాలు, టైపిస్టులు అతనికేసి కుతూహలంగా చూస్తున్నారు.

ఎకౌంటెంట్ చిర్నవ్వుతో చేతిలో వున్న పెన్ను వెనుక టిప్‌తో గడ్డంమీద గీసుకుంటూ — "ఏవిటి విశేషం కేశవ్?" అన్నాడు. కేశవ్ నవ్వుతూనే సమాధానంగా కవరు తీసి అతని చేతిలో పెట్టాడు. ఎకౌంటెంట్ ఆతృతగా కవరులోంచి కార్డు తీసాడు వధూవరుల పేర్లు చూద్దామని. కేశవ్ అక్కడ్నించి కదిలి వరుసగా అందరికీ వాటిని పంచి యివ్వసాగాడు.

ఆమె హృదయం పనసకత్తితో పొట్టు కొడుతున్నట్టు వేదన - చెవుల్లో వేలవేల తేనెటీగలు ఝుంకారాల్లు చేస్తున్న ధ్వని - కోపంతో, కసితో, పగతో ఆమె చేతులు వణుకుతున్నాయి. కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర - శరీరం కొలిమిలోపెట్టి కాలుస్తున్నట్టు, పొట్టలో వెయ్యి అగాధాలు తవ్వుతున్నట్టు మెలికలు తిప్పే బాధ. కేశవ్ నవ్వుతూ వస్తున్నాడు. ఆమెకి దగ్గరగా... యింకా దగ్గరగా ఆమెకి ఒక వెడ్డింగ్ కార్డు అందించాడు.

ఆమె అసంకల్పితంగానే చెయ్యిచాచి కార్డు అందుకుంది. మరు నిముషం ఆకార్డు ఆమె చేతుల్లో ముక్కముక్కలైంది. ఆ ముక్కల్ని అతని మొహంమీదికి విసిరింది. అవ్వన్నీ కేశవ్ మొహానికి తగిలి కింద చెల్లాచెదురుగా పడ్డాయి. ఆమె కేశవ్ చెంపల్ని వాయించింది. అతని స్టైయిలిష్ కూలింగ్ కళ్ళద్దాలు ఎగిరి అంత దూరంలో పడి ముక్కలైంది. బలంగా అతని చొక్కాని దొరకబుచ్చుకుని గుంజింది. దాంతో చొక్కా పైభాగంలోని మూడు గుండీలు తెగిపోయాయి.

ఇదంతా స్ప్లిట్ సెకండ్‌లో జరిగిపోయింది. యిప్పటికి కేశవ్ ఆగిపోయిన వూపిరి పీల్చుకుని, నిలదొక్కుకుని, అనితని విసురుగా వెనక్కి తోశాడు. అనిత వెనక్కి విరుచుకు పడి, కిందకి జారిపోయింది. ఆ పడిపోవడంలో వెనుక నున్న టేబిల్ కొన తలకి బలంగా తగిలింది. ఆమెకి స్పృహ తప్పింది.

యిదంతా భరించలేని, నమ్మశక్యంకాని కళ్ళతో చూస్తున్న ఆఫీస్‌స్టాఫ్ అప్పటికి తేరుకుని గబగబ అనిత చుట్టూ మూగారు.

*

రమణమూర్తి ఎన్నోసార్లు చదివిన పుస్తకమే, మళ్ళీ యిప్పుడు మనసంతా అందులో పెట్టి ఎరిక్‌వార్డ్ 'ఏ బుక్ ఆఫ్ మేకప్' చదువుతున్నాడు. ఆయన చుట్టూ పోర్ట్రైట్స్, పేపర్ కటింగ్సు, వాటికి సంబంధించిన ఫైల్సు వున్నాయి. మేకప్‌కి సంబంధించిన వస్తువులు వున్నాయి.

రమణమూర్తి సోలో ఏక్టర్ ఎంటర్‌టైనర్.



బహు పాత్రలని ఒకేసారి పోషిస్తూ పాత్రకి తగ్గ సంభాషణల్ని, నటనని పోషించే మోనో ఏక్టర్. ప్రేక్షకులకి ఆశ్చర్యం కలిగేలా కేవలం రెండే రెండు నిముషాల కాలవ్యవధిలో ఒక రూపం నించి మరో రూపంలోకి మారిపోతూ అలా రెండు గంటల్లో ఏభై పాత్రలకి పైగా రంగం మీద జీవింప చేస్తాడు. ఆ పాత్రలకి తగ్గ సంభాషణల్ని, నటనని చూపిస్తాడు.

యిప్పుడు గాంధీ... మరుక్షణం జిన్నా.

యిప్పుడు నెహ్రూ... మరుక్షణం స్టాలిన్.

యిప్పుడు షేక్స్‌పియర్ మరుక్షణం చెకోవ్ — అలా లెనిన్, షా, ఐన్‌స్టీన్ లాంటి ప్రముఖ వ్యక్తుల్నే కాక గని కార్మికుడిగా, పోలీసుగా, నక్సలైటుగా, దర్జీగా యింకా ఎన్నో రకాల వృత్తి కళాకారుల్ని, వుద్యోగుల్ని తన మేకప్ ప్రావీణ్యంతో ఒకే స్టేజీ మీద ప్రదర్శన యిస్తుంటాడు.

ఆయన పెట్టె తెరిస్తే దాన్నిండా సన్మాన పత్రాలు, ప్రశంసలు — 'యిటువంటి ఉత్తమ నటులను మనం పొందగలిగీ తగిన ప్రోత్సాహం యివ్వలేకపోతున్నాము' అంటూ ఆయన ప్రదర్శనలు చూసి సానుభూతిగా రాసిన రివ్యూస్ ఎన్నో వున్నాయి.

ప్రస్తుతం మేకప్ దానికి తోడుగా లైటింగ్ ఏరకంగా వుంటే ఆ పాత్ర వాస్తవంగా, ఎఫెక్టివ్‌గా వుంటుంది అనే విషయం గురించి, ఆలోచిస్తూ — నోట్సు వ్రాసుకుంటున్నాడు.

ఆయనకి ఈ కళలో చెర్కసోవ్, పాల్‌ముని, మజహర్‌ఖాన్, స్పెన్సర్ ట్రేసీ, డా॥ చంద్రశేఖర్ ఆదర్శాలు. వాళ్ళలా తనూ మేకప్ కళలో నిష్ణాతుడయి, ఏరూపంలోనైనా సులువుగా ట్రాన్స్‌ఫార్మ్ అయిపోవాలని, ఆ రూపం, పాత్ర వాస్తవంగా వుండాలని ఆశ. దానికోసమే ఆయన నిరంతర కృషి.

"రమణమూర్తిగారున్నారా?" బయట నించి ఎవరో కేక వేసినట్టుంది. మూర్తి గబగబా నోటు బుక్కు, పెన్ పక్కన పెట్టి బయట వరండాలోకి వచ్చాడు. ఆయన్ని చూడగానే వచ్చిన యిద్దరూ "నమస్కారమండి" అన్నారు. మూర్తి ప్రతి నమస్కారం చేస్తూ "లోపలికి రండి" అని ఆహ్వానించాడు.

వచ్చిన యిద్దరూ కుర్చీలో కూర్చుంటూ — అందులో ఒకవ్యక్తి "నా పేరు రాజారావండి. కళాసంఘంవారి కార్యదర్శిని. కళా సంఘం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా కళాకారులైన మీకు సన్మానం చేయాలనుకుంటున్నాం."

రెండో వ్యక్తి కల్పించుకుంటూ నమ్రతగా — "మీలాంటి కళాకారుల్ని కల్సుకోవడం నిజంగా

ప్రపంచంలో పెద్ద స్టేడియం.... స్ట్రాహావ్ స్టేడియం (ప్రేగ్–జెకోస్లోవేకియా) 240 000

మా అదృష్టం. మీరు జీవితమంతా మీ కళని తీర్చి దిద్దుకోవడానికే అంకితం చేసిన కళాతపస్వి. మీలాంటి నిపుణులు ఎందుకు అలక్ష్యం చేయబడతారో ఆశ్చర్యంగా వుంది'' అన్నారు.

రమణమూర్తి బిడియంగా – ''మీరేం అనుకోనంటే ఒక్క మాట. నాకు సన్మానం వద్దు. ఎలాగూ వార్షికోత్సవం అంటున్నారుగా.... నా కళని ప్రదర్శించడానికి అవకాశం యిప్పించండి. నేను రోనాల్డు రీగన్, రాజీవ్‌గాంధీ, జయిల్‌సింగ్, ఎన్. టి. రామారావుల మేనరిజమ్స్‌తో పాటు మేకప్‌తో కూడా లైటింగ్ ఎఫెక్ట్ బాగా స్టడీ చేశాను. అచ్చంగా వాళ్ళే అన్నట్టు నప్పేటట్టుగా పాత కాలపు కర్తర్ప గాంధీ, నెహ్రూ, వినోబాభావే వంటి వాళ్ళని కూడా ప్రదర్శిస్తా కాదనకండి'' అన్నాడు.



— కలిదిండి జయ

రాజారావు ఈ సంభాషణంతా వినడం మాత్రం విన్నాడు. ''ప్రదర్శన కుదర్దులెండి. మేము ఆల్‌రడీ బొంబేడిస్కో కింగ్ అమర్ అలీకి రెండు వేలు ఎడ్వాన్స్‌గా పేచేసి, అతని ప్రోగ్రామ్ ఫిక్సు చేసుకున్నాం.''

''ఎలాగూ సన్మాన మంటే రెండు గంటలు పడుతుంది. నాకు దండలు వేయడం, ప్రసంశా పత్రాలు చదవటం, పెద్దలు ముగ్గురో నలుగురో నాకళ గురించి తెలీక పోయినా నేను ఎంత గొప్ప కళాకారుడ్నో అని పొగడటం ఈతతంగ మంతా ముగియాలంటే రెండు గంటల పైనే పడుతుంది. ఆ రెండు గంటలూ నాకు కేటాయించారంటే— నాకళా ప్రదర్శన విజయవంతంగా ముగుస్తుంది.''

''అబ్బే లేదు మాష్టారూ–మేం వృద్ధ కళాకారుల్లో ఒకళ్ళని సన్మానించాలనుకున్నాం. మీరైతే బావుంటుంది అనుకున్నాం. నూటపదహార్లు యిచ్చి శాలువా కప్పుతాం. రాను పోను ఖర్చులు, అక్కడ భోజనం మిగతా వసతులు చూసుకుంటాం. ఆలోచించుకోండి.''

''నాకు నూటపదహార్ల సన్మానం వద్దు నాయనా, వంద రూపాయిలు యిప్పించండి. నా కళా ప్రదర్శనని ఏర్పాటు చేయండి. చాలు.''

''లాభం లేదు మాస్టారూ. మీరు ఎలాగూ ఒప్పుకుంటారు కదా అని మీకు శాలువా కప్పి దండ వేయడానికి ఏమ్. ఎల్. ఏ రంగనాయకులు గార్ని, మీ గురించి నాలుగు ముక్కలు మాట్లాడటానికి ఎమ్. పి. సాయినాధ్ గార్ని ఆహ్వానిం

నైలాన్‌ను కనిపెట్టినది ?

డ్యూపాంట్ (లాబ్) యు. ఎస్. ఏ. 1937లో

చేసాం'' అన్నాడు రెండో వ్యక్తి కల్పించు కుంటూ.

రమణమూర్తికి కొద్దిగా ఆవేశం వచ్చింది. నిజానికి ఆయనకి సన్మానం అవసరం లేదు గానీ ఆయనికి డబ్బు అవసరం, నూట పదహార్లు అత్యవసరం. ఆ డబ్బుతో ఆయన కొనాల్సిన మేకప్ సామాగ్రి లిస్ట్ వుంది. కాని రమణమూర్తి కళా ప్రదర్శన నిచ్చి తృప్తితో కొద్ది డబ్బయినా తీసుకుంటాడు గాని దండ వేయించుకుని, శాలువా కప్పించుకుని పదిమందితో పొగిడించుకోవడం మాత్రం చెయ్యడు. ''చూడు నాయనా. కళాకారుడికి ముఖ్యండబ్బుకాదు. సన్మానాలు అంతకన్నా కాదు. కావల్సింది కళాతృప్తి. మీరేదో వృద్ధ కళాకారులికి సహాయం చేస్తున్నాం గౌరవిస్తున్నాం సన్మానాల ద్వారా అనుకుంటే పొరబడి నట్టే. కళాకారుడు ఎప్పుడూ ప్రజలకు దగ్గరగా, ప్రజల్లో 'ప్రజ'గా వుండాలనుకుంటాడు. అది ఒక. తన కళా ప్రదర్శన ద్వారానే సాధ్యం గాని సన్మానాలు చేయించుకోవటం ద్వారా కాదు. మీరు వృద్ధ కళాకారుడ్కి నిజంగా సహాయం చేయాలనుకుంటే ఏ మంత్రి చేతో శాలువా కప్పించి, మరెవరో ఈ కళాకారుడి తపన, కృషి తెలియని వాడిచేత పొగిడించీ కాదు అతని ప్రదర్శన యిప్పించి–ఆ ప్రదర్శన ద్వారా ప్రేక్షకుల మనసుల్లో అతనికి సన్మానం చేయించండి. మంచిది. మీరు సన్మానమే ముఖ్యమనుకుంటే మరో వృద్ధ కళాకారుడ్ని చూసుకోండి'' అన్నాడు.

వాళ్ళు వెళ్ళిపోయారు.

తను ఎన్ని సంవత్సరాల నుంచో జాగ్రత్త చేసుకుంటూ, వచ్చిన విగ్గులు, అలంకరణలు పాలిథిన్ సంచుల్లోంచి వెల వెల పోతున్నట్టు కన్పించాయి ఆయనకి.

కళాకారుడికి కళా ప్రపంచం తనని మార్గంనించి తొలగించి, ప్రక్కన పెట్టి, అదిమాత్రం ముందుకు సాగిపోదనే నిజం అనుభవానికి రావడం.... సన్మానం చేస్తామని వచ్చిన ఈ కళా సంఘం తనలోని కళాకారుడ్ని భూతకాలంతో సరిపెట్టిందని, వర్తమాన, భవిష్యత్తులలో ఆ కళాకారుడికి యిక జీవం, స్థానం లేదని చెప్పిందని రమణమూర్తి గ్రహించాడు. యిక తనని తాను ఎక్స్‌ప్రెస్ చేసుకుంటూ తనద్వారా బ్రతికిన కళను తను ముందు ముందు పోషించలేడని యిప్పుడే అర్థమయింది రమణమూర్తికి.

యిలా నిజంగా నిజమైన వాస్తవం జీవిత దృక్కోణం నించి భవిష్యత్తుని గమనిస్తున్న రమణమూర్తి రిక్షాలోంచి తలమీద కట్టుతో దిగుతున్న కూతుర్ని చూసి నిలువడి పోయాడు.

*

రిక్షాలోంచి దిగి విసురుగా లోపలికి వస్తోంది అనిత. ఆమెకి మహాకసిగా వుంది. ఆక్షణం— యావత్ ప్రపంచాన్ని నల్లికింద మార్చి, బొటన వేలితో నలిపెయ్యాలని వుంది. ఎదురుగా కన్పించిన తండ్రిని చూడగానే–ఆమెకు తన బాధ సమస్తానికి ఆయనే కారణమన్పించింది. ఆమె కోపానికి ఆయన టార్గెట్ బోర్డ్ అయ్యాడు.

''నాన్నా'' హిస్టీరికల్‌గా అరిచింది.

రమణమూర్తి ''ఏమిటి తల్లీ'' అన్నాడు దయగా,

''నువ్వే.... నువ్వే కారణం. నా జీవితం యిలా అధ్వాన్నంగా తయారవడానికి నువ్వే కారణం'' అంది వుద్వేగంగా.

రమణమూర్తి తొణకలేదు. కూతురి మాటలు ఆయనలో ఎంత ఆవేదనని పుట్టించాయో కాని పైకి మాత్రం ఆయన నిశ్చలంగా కన్పించాడు. ''నువ్వెందుకిలా భావిస్తున్నావో నాకు అంతు పట్టటంలేదు. ఎవరి జీవితాల్లో మార్పులకి వారే కారణం కాని అవతలి వాళ్ళని అని ప్రయోజనం లేదు.''

''యిటువంటి నీటిమూటల్లాంటి మాటలు నాకు నిమ్మళం చేకూర్చవు. మొదట్నించీ యిలాంటి వెధవమాటలు చెప్పి నన్ను యిలా తయార్చేశావ్.''

రమణమూర్తి వంటింట్లోకి వెళ్ళి టీనీళ్ళు స్టౌమీద వేస్తూ— ''జీవితంలో ఒక దెబ్బ తగిలిందని, దానికి యితరులని బాధ్యులుగా చేయడం మంచిదికాదు. నీకు తగిలిన దెబ్బకి, నువ్వే తట్టుకుని నిలబడితీరాలి. అంతకుమించి మార్గంలేదు.''

''నాన్సెన్స్. నువ్వు చేసిన తప్పుకి నేను అనుభవిస్తున్నా. నువ్వు హిందువ్వి, అమ్మ ముస్లిం. మతాల పేరుతో దేశమే ముక్కలవుతున్న సమయంలో, ఏదో ఘనకార్యం, నిర్వాకం చేస్తున్నట్టు– ప్రేమ పేరుతో అమ్మని చేసుకున్నావు. బహుశ అప్పుడు చాలా గొప్పపని హీరోలా చేశాను అనుకుని వుండొచ్చు.''

''అప్పుడే కాదమ్మా.... యిప్పటికీ అనుకుంటున్నా.''

''అనుకుంటావు.... ఎందుకు అనుకోవు. ఈ సెక్యులర్ రాజ్యంలో నేను నా కులం, నా మతం ఏవిటి? స్కూలు రిజిష్టరులో తండ్రి మతంగా నేను హిందువుని. కాని ప్రజల దృష్టిలో సంకర జాతి పిల్లని. అటు ముస్లిం, యిటు హిందువు... ఎవరూ నన్ను పెళ్ళి చేసుకోవడానికి ముందుకు రావడంలేదు.''

''.... .... ....''

''దానికిసాయం నువ్వు నన్ను స్వేచ్ఛగా తిరగనిచ్చావు. అమ్మాయిని అమ్మాయిలా పెంచకుండా యిష్టం వచ్చినట్లు వదిలేశావు. పైగా నీ జీవితం నీ యిష్టంవచ్చినట్లు జీవించు అనే స్వేచ్ఛా సిద్ధాంతాన్ని వల్లించావు. స్వేచ్ఛ నివ్వడం ఆదర్శంగా మురిసిపోతూ నన్ను పెంచుకొచ్చావు.''

''.... ....''

చివరికి ఆ ఆదర్శం ఏమయ్యింది నన్ను కాటేసింది. ప్రేమ వ్యామోహంలో పడి నన్ను నేను మోసం చేసుకున్నా. నాకు నేను దక్కకుండా పోయాను. నా వ్యక్తిత్వం, యింత వరకు పెంచుకుంటూ వచ్చిన జీవితం–దారి అన్నీ నలిగి నాశనమయ్యాయి. ఈ రోజు కేశవ్ వెడ్డింగ్ కార్డులు పంచి, నా జీవితం పదిమందిలో హాస్యాస్పదం చేశాడు.''

టీ గ్లాసుని కూతురికి అందిస్తూ — ''ముందు టీతాగు. కోపం చల్లారుతుంది. తర్వాత ఈ విషయం నిమ్మళంగా ఆలోచిద్దాం'' అన్నాడు. తండ్రి చేతికిచ్చిన గ్లాసుని మహావేశంతో విసిరేస్తూ ''యింకా ఆలోచించడానిక్కి ఏం మిగిలిందని'' అంటూ గొంతు బొంగురు పోయేలా అరిచింది. ''ముందు నాకు నీ సమాధానం కావాలి.''

రమణమూర్తి కూతురు ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ–''చూడమ్మా–నేను నిన్ను గాలిలో వదిలేయలేదు. జీవిత అనుభవాలు, ఇప్పటి పరిస్థితులు అన్నీ వివరించి విపులీకరించి చెబుతూ వచ్చాను. ప్రేమ వ్యామోహం కాకూడదని. లవ్ ఈజ్ నాట్ లుకింగ్ ఎట్ ఈచ్ అదర్ బట్ టుగెదర్ లుకింగ్ ఇన్ ఒన్ డైరక్షన్, అనే చెప్పాను. ప్రేమ, మోహం, కామం అన్ని విషయాలు–కూతురివి, ఆడపిల్లవి అని కాకుండా అన్నీ సైన్సుగా వివరించాను. ఈనాడు నువ్వు

[62వ పేజీ చూడండి]

[5?వ పేజీ నుంచి]

ప్రేమలో ఫెయిల్ అయ్యావు. దానికి నిన్ను నేను నిందించడం లేదు. ఎందుకంటే ప్రేమ సఫలీకృతం కావాలంటే మరో వ్యక్తి సహాయం కావాలి.''

''ఆ దౌర్భాగ్యుడు కేశవ్ యింత అన్యాయం చేస్తాడనుకోలేదు.''

''అసలు ప్రేమించడం తెలీకపోవడం కన్నా ప్రేమించి, ప్రేమలో భంగపాటు చెందడం ఎంతో వుత్తమం అన్నాడో కవి. నీ ప్రేమకి కేశవ్ అనర్హుడు అని తేలింది. అటువంటి వాడి గురించి యిక ఆలోచించకు'' అన్నాడు రమణమూర్తి అనునయంగా.

తండ్రి అనునయం ఆమెని మరింత వెర్రెక్కించింది. ''నా ప్రేమకి కేశవ్ అర్హుడు కాడని ఒక్క ముక్కతో తేల్చేశావు. కబుర్లు చెప్పడం కాదు, అర్హుడైన వాడ్ని నువ్వు తీసుకురాగలవా? అలా తీసుకు రావడం తండ్రిగా నీ బాధ్యతకదూ. కాని నువ్వు మొండి చేతితో స్టుపిడ్‌లా కూతురి మీద ఆధారపడి నిల్చున్నావ్.''


రమణమూర్తికి ఈ మాటలతో తన హృదయాన్ని పెకిలించి, ఎత్తిపట్టి గుండు సూదులుతో గుచ్చినట్టుయ్యింది. మొండి చేయిగా మిగిలిన తన ఎడం చేతిని అప్రయత్నంగా ఒకసారి చూసుకున్నాడు. ఎందుకో ఆయన గతాన్ని ఒక్కసారి విప్పుకోవాలనుకున్నాడు.

''నీకు నన్ను నిందించి తప్పు పట్టుకుంటే మనశ్శాంతి లభిస్తోందనుకుంటే అలాగే కానియ్యి. నాకు యింతకన్నా పెద్దదెబ్బలే తగిలాయి. 1962లో నేను అక్కడ చైనా సరిహద్దుల్లో కాపలాగా వున్నాను. మంచు కొండల్లో—స్టెన్‌గన్‌తో నిల్చున్నాను. దేశాన్ని రక్షించాలి. దేశీయుల్ని రక్షించాలి. అదొక్కటే నాదీక్ష. అప్పుడే నా భార్య ఈ దేశంలో ప్రజల మధ్య పురిట నెప్పులతో బాధపడుతోంది. కాన్పు కష్టమవుతుందని తెల్సు. కాని ఎవరూ హాస్పటల్‌లో చేర్చలేదు. కారణాలు అనేకం, మొత్తానికి ఆ కష్ట సమయంలో ఆత్మీయులు దగ్గరలేక, వాతం కమ్మి నాభార్య మరణించింది. నాకు ఆ క్షణంలోనే మానవత్వం మీద నమ్మకం చచ్చిపోవాలి. 'యిటువంటి దయ కరుణ లేని మానవుల్ని రక్షించాలనా నేను ప్రాణాలు ఒడ్డి పోరాడాను' అని ప్రశ్నించు కోవాలి. ఆశయం, ఆదర్శం మీద విరక్తి కలగాలి. మిషనరీలు కాపాడిన నిన్ను యిదే సమాజంలో ఒంటిచేత్తోనే పెంచుకుంటూ వచ్చాను. ఈ సమాజం వలన— నా చెయ్యి పోయింది. నా భార్య పోయింది. ఈ నాడు నా కూతురు తన జీవిత సహచరుడు కావాలనుకున్న వాడ్ని పొందలేక పోయింది. కాని నాకు మానవత్వం మీద, విలువల మీద నమ్మకం చావలేదు. మనిషిగా నేనింకా బ్రతికే వున్నాను''

ఆయన కళ్ళు చెమర్చాయి.

రమణమూర్తి మాటలు అనితని కదిలించాయి. ఆమెకి దుఃఖం వుప్పెనలా సాగింది. పోటెత్తిన సముద్రంలో భావావేశంతో ఆమె మనసు ఎగిసి పడింది.

తండ్రి గొప్ప వ్యక్తిత్వం తనకి తెలుసు. అయినా అంత కఠినంగా ఎలా మాట్లాడగలిగింది. యిదే మరో తండ్రి అయితే తనని ఎంత కట్టడి చేసి, యిప్పుడు ఎంతో అసహ్యించుకునును. రమణమూర్తి, ఎక్స్ మిలటరీమాన్, తన తండ్రి అయ్యాడు కాబట్టి యింత వేదనా తను దిగమ్రింగుకోగలదు. కాని కేశవ్‌ని మాత్రం తను వదలదు. అతని మీద ప్రతీకారం తీర్చుకుంటుంది. అతనికి




కేశవర్ధిని...
పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం

పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె

అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్దిముక్కల కేశవర్ధినిని ఒక చెంబాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగలాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




కేశవర్ధిని
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ మద్రాసు-600 087

OBM 8473/TG

మరో స్త్రీతో వివాహం జరగటానికి వీల్లేదు. తనని నాశనం చేసినందుకు అతను కుళ్ళి కుళ్ళి ఏడ్చేలా చేయాలి-' నిర్ణయించుకుంది మనసులో అనిత.

*

ఆరోజే కేశవ్ మరో ఆడదాని మెళ్ళో తాళి కడ్తాడు. అనిత దీర్ఘంగా ఆలోచిస్తోంది.

కేశవ్ నిజ స్వరూపం యిప్పుడు తెలుస్తోంది. కాని ప్రయోజనం ఏమిటి? బాహ్యానికి సముద్రం హుందాగా, గంభీరంగా వుంది అన్పింప చేస్తుంది. దగ్గరకి వెళ్ళి దాని నీరు నోట్లో వేసుకున్నప్పుడు కాని దాని నిజరుచి తెలీదు. దాహంతో అక్కడికి వెళ్ళిన వాళ్ళు వెనక్కి నిరాశతో తిరిగి రాక తప్పదు. అనిత అటువంటి నిరాశతో చిక్కిపోతూ శూన్యమవుతూ వస్తోంది.

సరితిండి,

సరి నిద్ర,

సరి శాంతి—

లేక ఆమెకి సెప్టిక్ అల్సర్ వచ్చింద.

ఆఫీసులో టైపు చేస్తున్న పేపర్ల నిండా తప్పులు.... తప్పులు... తప్పులు. విషయం తెల్సిన ఆఫీసరు మొదట్లో ఏమీ అనకపోయినా, రానురాను విసుక్కుంటున్నాడు. ఎవరయినా కొంత వరకే తప్పుల భారం మోస్తారు. దీని వెనుక నున్న మూలం ఏమిటి అని ఆర్ద్రంగా ఆలోచిస్తారు. కాని శ్రుతి మించితే భరించరు. దాంతో ఆఫీసులో వార్నింగ్‌లు, అటు తర్వాత మెమో వచ్చింది.

కేశవ్ పెళ్ళి జరిగిపోయింది.

అతనిచ్చిన రిసెప్షన్ గ్రాండ్‌గా వుందని ఆఫీసు స్టాఫంతా మెచ్చుకున్నారు. కేశవ్ పూల రంగడిలా, అత్తరు పెట్టిన కొత్తబట్టలతో, ఈలపాట పాడుకుంటూ, ఆఫీసుకి వస్తున్నాడు. ఖుషీగా, జల్సాగా వుంటున్నాడు.

అనిత రోజు రోజుకూ కృగిపోతోంది. అంతకు ముందు ఎవరినీ పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వుండే అనిత యిప్పుడు అందరూ తనని గురించి ఏమనుకుంటున్నారో గమనిస్తోంది. ఆ గమనించటం ఆమెకి వేదనని, దుఃఖాన్ని పెంచింది కాని తగ్గించలేదు. సమాజం మరొకళ్ళని వేలెత్తి చూపే అవకాశం వస్తే అంత తేలిగ్గా జారవిడుచుకోదు.

ఈ వ్యతిరిక్తత ఆమె భరించలేక పోతోంది. వ్యక్తిత్వం అని ప్రాకులాడకుండా మంచో చెడో సమాజపు సూత్రాలకు తల వంచి సమాజపు పరిధిలో తల వంచుకు బ్రతకటం చాలా సుఖం అని ఆమె తెల్సుకుంది. ఎదురు గాలితో పోరాటం ఆమెలోని విలువల్ని దిగజార్చేస్తోంది.

చాలా ఆలోచనల అనంతరం అనిత, కేశవ్ భార్యని కల్సి ఆవిడకి తాము తీయించుకున్న ఫొటోలు, కేశవ్ తనకి వ్రాసిన ఉత్తరాలు చూపించాలి అని నిర్ణయించుకుంది. ఆవిడకు యివ్వన్నీ చూస్తే, మొగుడి మీద అసహ్యం, జుగుప్స కలుగుతుంది, వీటిగురించి—

మొగుడ్ని ప్రశ్నిస్తుంది—

ప్రశ్నలతో హింసిస్తుంది—

హింసతో బాధిస్తుంది—

బాధతో కేశవ్ జీవితాన్ని నరకం చేస్తుంది. అదే తనకు కావలసింది. ఏ భార్య తన భర్త పెళ్ళి కాకముందు ప్రేమ వ్యవహారాలు నడిపాడంటే సహించదు. వాడిని అనుక్షణం ఆ విషయాలు అడుగుతూ, దెప్పుతూ వుంటుంది. ఇంటికి క్షణం ఆలస్యంగా వచ్చినా, అప్రయత్నంగానైనా ఏ ఆడదాన్ని చూసినా అనుమానంతో చంపుతుంది.

ఆరోజు అనిత ఆఫీస్‌కి లీవుపెట్టి-మధ్యాహ్నం కేశవ్ ఇంటికి వెళ్ళింది.

*

మరుసటి రోజు కేశవ్ మొహం ఎలా మాడిపోయి వుంటుందో చూడటానికి మహా కుతూహల పడుతూ అనిత ఎదురు చూస్తోంది.

కాని కేశవ్ రాలేదు.

మరో వారం రోజులకి కేశవ్ భార్య కోర్టులో విడాకుల కోసం అప్లై చేసిందని తెల్సింది.

అందరికన్నా షాక్ తిన్నది అనిత. కేవలం భర్త పెళ్ళికి ముందు ఎవత్తి వెంటో తిరిగాడని విడాకులు యిచ్చే ఆడవాళ్ళుంటారని తెలియటం యిదే మొదటిసారి. పైగా కేశవ్ భార్య రాధిక తల్లి, తండ్రి, అన్నగారి సలహాలకి వ్యతిరేకంగా విడాకులు కోరుతోంది. అపూళ్ళనే ప్రవేటు స్కూల్లో టీచరు ఉద్యోగం సంపాదించింది కూడా!

*

అనిత నడుస్తోంది పార్కు నుంచి ఇంటి వైపుగా. పక్కన కేశవ్ నడుస్తున్నాడు. ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

అనిత ఆలోచనలు ముడి విడిన దారాల్లా సాఫీగా సాగుతున్నాయి. కేశవ్ ఆమెని పెళ్ళి చేసుకుంటానని అంటున్నాడు. ఆమె అంగీకారం కోసం నిరీక్షిస్తున్నాడు. కేశవ్ తనని అలా అడగటం ఆమెకి ఆశ్చర్యంగానే వుంది. అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటానంటే, కట్నం గుమ్మరించి, అతనికి పిల్లనివ్వడానికి, అతనికి తెలిసి చాలా మంది అమ్మాయిల తండ్రులున్నారు. కాని కేశవ్ తన అంగీకారం అడుగుతున్నాడు. పైగా గతంలో తను చాలా పొరపాటు చేశానని, అనితకి తన వల్ల అన్యాయం జరిగిందని క్షమాపణగా చెప్పుకున్నాడు.

కేశవ్‌లో చాలా మార్పు వచ్చినట్టు ఆమెకి అన్పించింది.

విప్పారిన మొహంతో గేటు తెరుచుకు వస్తున్న కూతుర్ని చూశాడు మూర్తి.

"నాన్నా! నేను పెళ్ళి చేసుకుంటున్నా" ఇంట్లోకి వచ్చీరావటంతో అంది అనిత.

రమణమూర్తి ఆశ్చర్యపోయాడు.

"ఎవర్ని?"

"కేశవ్‌ని."

రమణమూర్తి నిర్ఘాంతపోయాడు. ఆయన మొహం నల్లబడింది. "రాధిక విడాకులిచ్చిన సంగతి తెల్సిందీ...."

"అవున్నాన్నా. రాధిక అమాయకురాలు కాపోతే మూర్ఖురాలు. కాకపోతే కేవలం భర్త పెళ్ళి కాకముందు ఎవత్తెకోసో తిరిగాడని విడాకులిస్తారా? తెలివైన వాళ్ళయితే మొగుడు మళ్ళీ అటువంటి వెర్రివేషాలు వెయ్యకుండా జాగ్రత్తగా చూసుకుంటారు. కాని మొత్తానికి మొగుడినే వదిలేయరు. పైగా తల్లిదండ్రుల్ని, అన్నలనీ, సమాజాన్నీ అందర్నీ ధిక్కరించి మరీ విడాకులిచ్చేసింది."

"నువ్వనుకున్నట్టు ఆ అమ్మాయి అమాయకురాలు కాదు. మూర్ఖురాలు మరసలేకాదు. వ్యక్తిత్వం లేని మోసగాడితో తను బ్రతకలేననుకుంది. విడాకులిచ్చేసింది. కేశవ్‌కి మరోదిక్కు లేక మళ్ళీ నీ దగ్గరకు వచ్చాడు."

"కాదు నాన్నా నువ్వు పొరపడుతున్నావు.

కేశవ్‌కి పిల్లనివ్వడానికి ఎంతో మంది అమ్మాయిల తండ్రులు ఎదురుచూస్తున్నారు.''

''తండ్రులుండొచ్చు. కాని కేశవ్‌తో మళ్ళీ కాపురం చేసే కూతుళ్ళు వుండొద్దూ.''

''అదేమిటి?''

''మరి రాధిక ఏం చేసిందో నువ్వు స్వయంగా చూసీ ఏం తెలుసుకున్నావు? కేశవ్ మళ్ళీ అటువంటి రిస్క్ తీసుకుని సమాజంలో మరోసారి నవ్వులపాలు కాదల్చుకోలేదు. అందుకే సేఫ్టీగా వుంటుందని నిన్ను చేసుకోవాలను కుంటున్నాడు.''

''పోనీలే నాన్నా. ఏదో ఒకటి కేశవ్ మళ్ళీ నా దగ్గరికి వచ్చాడు.''

''కేశవ్ రాధికని చేసుకోవడంతో — అతను నిన్నే కాకుండా మరో అమ్మాయిని కూడా మోసం చేశాడు. ఆ విషయం మర్చిపోకు. పైగా రాధికకి ఈ విషయం నువ్వు స్వయంగా వెళ్ళి చెప్పావు కూడా. ఆ కోపంలో నువ్వు, నీకు కేశవ్ ద్వారా కడుపొస్తే అబార్షన్ కూడా చేయించుకున్నానని అబద్ధం కూడా చెప్పావు. అవ్వన్నీ ఋజువులతో సహా చూపి, రాధిక భర్తని భర్తగా గౌరవించలేనని నిర్ధారణ చేసుకుని — వదిలేసింది. యింత జరిగాక నువ్వు....''

''నాకు కేశవ్ ముఖ్యం, రాధిక కాదు. రాధిక తన జీవితం అలా చేసుకున్నందుకు నేను కాని, కేశవ్ కాని బాధ్యులం కాము.. నాన్నా నీకు ప్రపంచం తెలీదు. అందుకే కేశవ్‌ని మోసగాడు అంటున్నావు. అతడు మోసగాడు అవనీ దుర్మార్గుడవనీ నా ధగ్గరకు మళ్ళీ వచ్చాడు. నాకో భర్త కావాలి. యింత కంటే మంచివాడు భర్తగా ఈ సమాజంలో దొరుకుతాడని నాకు 'జీరో' నమ్మకం మాత్రం వుంది. ఈ సమాజంలో నాలాంటి ఆడపిల్లకి 'హాబ్‌సన్స్' ఛాయిస్ మాత్రం వుంది. సమాజానికి ఎదురీదడం అంటే ఏమిటో నాకు తెల్సు. అది ఎంత కష్టమో కూడా తెల్సు. నేను ఆడదాన్ని నాన్నా.''

''రాధిక ప్రస్తుత సమాజం వెలి వేసిన జీవితానికి నువ్వు గాని, కేశవ్ గాని బాధ్యులు కారని అన్నావు. అది చాలా తప్పుడు అభిప్రాయం అని నీకు తెలుసు. కేశవ్ నిన్ను మోసం చేసి, ఆ విషయం దాచి, రాధికను డబ్బు కోసం చేసుకుని, ఆమెను మోసం చేశాడు. ఆ మోసాన్ని భరించలేక. ఒక ఆడపిల్ల జీవితంతో ఆటలాడుకున్న మనిషిని, తన భర్తగా గౌరవించలేని రాధిక విడాకులిచ్చింది. అటువంటి వాడ్ని నువ్వు తిరిగి ఒప్పుకుంటూ, రాధికని మరోసారి మోసం చేస్తున్నావు. ఈ చేస్తున్న వ్యక్తిత్వంలేని పనికి — 'నేను ఆడదాన్ని' అనే ఎక్స్‌ప్లనేషన్ యివ్వకు. కేశవ్‌ని వదిలిన రాధిక కూడా ఆడదే''

''నేను బ్రతకాలి. పోరాటంగా కాక శాంతిగా జీవితం గడిపాలి, అంటే కొన్ని విషయాల్లో రాజీపడాలి. నేను రాజీ పడుతున్నా, భీకరమైన తుఫాను వస్తే, నిట్రాడులా, తల పైకెత్తి నిల్చున్న మరిచెట్టు క్రూకటి వ్రేళ్ళతో సహా స్థాన భ్రంశం చెంది కూలిపోతుంది. కాని తల వంచిన గడ్డి మొక్క చక్కగా బ్రతకగలదు.




రాజీపడటం చేతకానితనం, వ్యక్తిత్వం లేని విషయం కాదు నాదృష్టిలో — దీన్ని గురించి గురించి పెద్దగా చర్చించాల్సిన విషయం లేదు నాన్నా —''

''జీవితానికి నిజమైన అర్థం వెతుక్కునే అవసరంలో రాధిక కేశవ్‌ని త్యజించింది. అదే మోసగాడ్ని జీవితంలో ఎదురు దెబ్బతిని నువ్వు రాజీపడి స్వీకరించాలను కుంటున్నావు. కేశవ్ అవకాశవాది. రాధిక మీ విషయాలన్నీ తెలిసీ, అతన్ని ఆదరించి వుంటే అతను నీదగ్గరికి వచ్చేవాడు కాదు. అతన్ని చేసుకుని నువ్వు సుఖపడతావనుకోటం నీభ్రమ.''

''లేదు నాన్నా. అతను మళ్ళీ నాదగ్గరికి వచ్చే పరిస్థితి ఏర్పడటం నా అదృష్టం. నాకు కేశవ్ కావాలి. నువ్వూ కావాలి. నేను కేశవ్‌తో ఎంతో చెప్పి, నువ్వు మాతో కలిసి వుండటానికి, బలవంతాన ఒప్పించాను.''

రమణమూర్తి, మౌనంగా కూర్చుండిపోయాడు. వ్యక్తిత్వంతో పెంచాననుకున్న కూతురు, యిటువంటి నిర్ణయం తీసుకోవడం ఆయనలో కలవరం రేపింది. యింత వరకూ దేశం, సమాజం కొట్టిన దెబ్బల్నుంచి తేరుకుంటున్న ఆయన కూతురి ప్రవర్తన వలన మళ్ళీ ఆగాధంలోకి తోయబడుతున్నట్టు ఫీల్ అయ్యాడు.

సేఫ్టీ, సెక్యూరిటీల కోసం తాపత్రయ పడి వాటి కోసం, జీవితంతో, కేశవ్‌తో రాజీ పడుతుంది. ఈ కూతురు రాధిక జీవితం ఎటువంటి పోరాటంలోకి నెట్టబడిందో ఆయన మరిపోలేదు. ఒక రోజు సాయింత్రం అకస్మాత్తుగా పార్కులో కల్సినప్పుడు మాటల మధ్యలో —'' అనిత అదృష్టవంతురాలు — మీలాంటి తండ్రిని పొందడంలో'' అని అభిమానంగా అన్న రాధిక ఆయన మనసులో మెదిలింది.

గబ గబా లేచి ఆయన తనకు సంబంధించిన వస్తువుల్ని పేక్ చేసుకో సాగాడు.

అనిత ఆశ్చర్యంగా చూసింది. ''ఏమిటి నాన్నా యిది?''

''అమ్మా నువ్వు బలవంతం చేసి కేశవ్‌ని ఒప్పించాను అన్నావు. చాలా సంతోషం. కాని కూతురిగా, యిక నీకు ఈ తండ్రి అవసరం లేదు. తండ్రిగా నేను, నీమీద పెట్టుకున్న నమ్మకాలు వమ్ము చేసిన కూతురిగా యిక నువ్వు నా కూతురివి కాలేవు. మరో కన్నతండ్రి కూతురు రాధిక, నా కూతురవగలదు. నిన్ను కన్న ఈ తండ్రి ఆ కూతురికి తండ్రి కాగలడు. నేను యుద్ధం ప్రసాదించిన ఈ మొండి చేత్తో ఎవరు గుర్తించినా, గుర్తించకపోయినా నాలోని కళాకారుడ్ని బ్రతికిస్తూ వచ్చిన కళతో సమాజం, తలిదండ్రులచే వెలివేయబడిన, నీతో మూర్ఖురాలిగా చెప్పబడిన 'నా కూతురు' రాధికతో నేను యికనుంచీ జీవిస్తానమ్మా. జీవితం ఆటుపోటులకి తలవంచేసిన నీకన్నా, ఎదురొడ్డి నిల్చిన రాధికకి నా అవసరం ఎక్కువమ్మా. అలాగే అటువంటి కూతురు నాకు అవసరం. వస్తానమ్మా.''

రమణమూర్తి మెట్లుదిగి వీధిలోకి నడిచి సంధ్య చీకట్లని తప్పించుకుంటూ నిబ్బరంగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. □